

డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితి పెంచాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం జులై ఒకటో తేదీన డీఎస్సీ 2024 నోటిఫికేషన్ ప్రకటించింది. అందులో పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు వయోపరిమితిని సడలించి 48 సంవత్సరాలకు పొడిగించాలని, ప్రభుత్వం డీఎస్సీ కోచింగ్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని, నకిలీ కోచింగ్ సెంటర్స్ పైన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం డీఎస్సీ లేకపోవడం వల్ల చాలా మంది నిరుద్యోగులు వయస్సు అయిపోవడం వల్ల చాలా తీవ్రమైనటువంటి ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు కోచింగ్ సెంటర్లలో లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కోచింగ్ తీసుకున్నా, వయో పరిమితి దాటిపోవడంతో ఈ డీఎస్సీలో అప్లై చేసుకోలేకపోతున్నారన్నారు.వయో పరిమితిని 48 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్ పేరుతో మూసివేసిన పాఠశాలలను తెరవాలని విజ్ఞప్తి చేశారు.



అతిసార విజృంభణ

రెండేళ్ల చిన్నారి మృతి
కాట్రపల్లి దళితవాడలో 49 మంది బాధితులు
జిల్లాను కలవర పెడుతున్న డయేరియా

కెవిబిపురం మండలంలో..



ప్రజాశక్తి - కెవిబిపురం

తిరుపతి జిల్లా కెవిబిపురం మండలంలోని కాట్రపల్లిలో అతిసార తీవ్రరూపం దాల్చింది. పరిస్థితి తగ్గుముఖం పట్టకపోగా, అతిసార బారిన పడి కాట్రపల్లి దళితవాడకు చెందిన కామాక్షి, దస్వంత్‌ల కుమార్తె దర్శిని (2) మృత్యువాత పడింది. బుధవారం వేకువజామున దర్శినికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. గంటలోనే 15సార్లు విరేచనాలు అవడంతో చిన్నారిని తల్లిదండ్రులు హుటాహుటిన శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గంటల వ్యవధిలోనే చిన్నారి దర్శిని మృతిచెందింది. చిన్నారి తమ్ముడు హర్షిత్ (9 నెలల పసికందు) విరేచనాలతో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

'స్థానిక' ప్రజాప్రతినిధులకు పట్టని తీరు

గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, డయేరియా రాకుండా చర్యలు తీసుకోవాల్సిన ప్రజాప్రతినిధులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికే కాట్రపల్లి గ్రామంలో 32 మంది బాధితులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో 17 మంది కెవిబిపురం పిహెచ్‌సి, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం తీసుకుంటున్నారు. అయినా జిల్లా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. పారిశుధ్య లోపం, తాగునీరు కలుషితం అవడంతో ప్రతి ఏటా రోగాలు పంజా విసురుతూనే ఉన్నా ఏమాత్రం పట్టకుండా నిర్లక్ష్యంగా ఉన్నారన్నది స్థానికుల ఆవేదన. ఈ నేపథ్యంలోనే దర్శిని అనే చిన్నారని బలయ్యిందని వాపోయారు.

పాచిపట్టిన నీళ్ల వల్లేనా..

సమస్యను అధికారులు లైట్‌గా తీసుకున్నందువల్లే తీవ్రరూపం దాల్చింది. నాలుగు నెలలుగా శుభ్రం చేయని వాటర్ ట్యాంక్ నుంచి పాచిపట్టిన నీటినే తాగాల్సి వస్తుంది. తాగునీరు కలుషితం, పారిశుధ్య లోపం అని స్థానికులు ఆరోపిస్తున్నా అధికారుల్లో చలనం లేకుండా పోయింది.

చిన్నారి కుటుంబాన్ని పరామర్శించిన ఆదిమూలం

చిన్నారి దర్శిని మృతి ఘటన తెలుసుకున్న ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం, డిఎంహెచ్‌ఒ శ్రీహరిలు చిన్నారి కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామంలో పారిశుధ్యం పనులు వేగవంతం చేయాలని, ఇలాంటి ఘటన మరోసారి జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

దళితవాడలో మెడికల్ క్యాంప్ : డిఎంహెచ్‌ఒ

కాట్రపల్లి గ్రామంలో అతిసార తగ్గుముఖం పట్టే వరకూ దళితవాడలో మెడికల్ క్యాంపు కొనసాగిస్తామని డిఎంహెచ్‌ఒ శ్రీహరి తెలిపారు. గ్రామంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని, ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన వారి దగ్గరకు వెళ్లి పరిశీలించి పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలిస్తామని తెలిపారు. 108 వాహనం ఎపుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

జిల్లాలో పెరుగుతున్న బాధితులు

పుత్తూరులోని నందిమంగళం గ్రామంలో రెండు రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో బాధితులు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. తాగునీటిలో మురుగునీరు కలవడం వల్ల ఇలాంటి ప్రమాదం ఉంటుందని అధికారులు తెలిపారు. గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు గిరిజన గురుకుల పాఠశాలలో కలెక్టర్ ధ్యానచంద్ర మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం హాస్టల్లో కలుషిత నీరు తాగడంతో దాదాపు 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆరుగురు విద్యార్థులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారిని హాస్టల్‌కు తరలించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. పాఠశాలలోని ఆర్‌ఒ ప్లాంట్, బోరును తనిఖీ చేశారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకూ తాగునీటిని బయట నుంచి తీసుకొచ్చి విద్యార్థులకు అందించాలని సూచించారు. డిఎంహెచ్‌ఒ శ్రీహరి విద్యార్థులను పరామర్శించారు. ఇటీవల కురిసిన అడపాదడపా వర్షాలతో పల్లెల్లో అతిసార ప్రబలుతోంది. తాగునీటి పైపులైన్లు దెబ్బతిన్నవాటిని మరమ్మతు చేయడానికి నిధులు లేకపోవడంతో కలుషిత నీటినే గ్రామస్తులు తాగుతున్నారు. తొట్టంబేడు మండలంలోని చియ్యవరం గ్రామంలో పైపులైన్ లీకేజి అయ్యి రెండు నెలలు గడస్తున్నా పంచాయతి సర్పంచి, కార్యదర్శి పట్టించుకోలేదు. దీంతో పెంచలయ్య రెండు రోజుల క్రితం అతిసారతో ఎంజిఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అదే మండలం బసవయ్యపాలెంలో అంగన్‌వాడీ కార్యకర్త రేవతి ఎంజిఎంలో చికిత్స పొందుతోంది.

కుప్పం నుంచే శ్రీకారం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, శాంతిపురం

పేదరికం లేని గ్రామం, పేదరికం లేని మండలం, పేదరికం లేని నియోజకవర్గంగా ముందు కుప్పాన్ని తయారు చేస్తానని, గత పాలనకు, ఇప్పటికీ చాలా వ్యత్యాసం ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. అధికారులు ఫిజికల్‌గానూ, వర్చువల్‌గానూ పని విధానాలకు సిద్ధపడాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గంలో రెండో రోజులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం కుప్పం అతిథిగృహంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. కుప్పంలో రౌడీయిజం, హింస, గంజాయి, అక్రమాలు ఎటువంటి పరిస్థితుల్లోనూ కనిపించకూడదన్నారు. రౌడీయిజం చేసేవారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. గత ఐదేళ్లు అధికారులు మనస్సు చంపుకుని పనిచేశారని, వైసిపి నేతల పైశాచిక ఆనందానికి కొందరు అధికారులు సహకరించారన్నారు. తన సొంత నియోజకవర్గానికి తాను రాలేని, మాట్లాడలేని పరిస్థితిని గత ఐదేళ్లలో కల్పించారన్నారు. తనపై హత్యాయత్నం కేసు పెట్టారన్నారు. 2019 వరకూ తనపై ఒక్క కేసు లేదని, గత ఐదేళ్లలో అక్రమ కేసులు అనేకం పెట్టారన్నారు. కుప్పంలో మళ్లీ ప్రశాంతమైన వాతావరణం తీసుకొస్తానన్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించి తాగునీటి సమస్య పరిష్కరిస్తానని, హంద్రీనీవా కాల్వ పనులు పూర్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, వ్యవసాయంలో మెరుగైన విధానాలు తీసుకురావాలని, డెయిరీ, మిల్క్, సిల్క్, హనీ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కుప్పానికి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తెస్తామన్నారు. కుప్పాన్ని ఎడ్యుకేషన్ హబ్ చేస్తానన్నారు. యువతలో నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తానన్నారు. రైతులకు సబ్సిడీలు అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి డిపార్టుమెంట్ నుంచి పక్కా ప్రణాళికతో రావాలని, నెలల వ్యవధిలోనే కుప్పంలో మార్పు చూపించాలని అధికారులను ఆదేశించారు.

'చరణి'గా చిన్నారికి నామకరణం

శాంతిపురం మండలానికి చెందిన సుధాకర్, ప్రియ దంపతుల రెండో కుమార్తె చిన్నారికి 'చరణి' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా నామకరణం చేశారు. బుధవారం ఆర్ అండ్ బి అతిథిగృహంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజలు ముఖ్యమంత్రిని కలిసారు. ఈ సందర్భంగా ఈ దంపతులు తన కుమార్తె చిన్నారికి నామకరణం చేయాలని కొరగా, ముద్దులొలికే పాపకు చరణి అని పేరు పెట్టారు. దీంతో దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.

846 సమస్యల అర్జీలు

ఆర్ అండ్ బి అతిథిగృహంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ ద్వారా 846 సమస్యలపై అర్జీలు అందాయి. ఉదయాన్నే అర్జీదారులు ఇబ్బంది పడకుండా జిల్లా యంత్రాంగం టిఫిన్, తాగునీరు, మజ్జిగ అందించింది. జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున అర్జీదారులు చంద్రబాబును కలిసేందుకు విచ్చేశారు. చంద్రబాబు స్వయంగా అర్జీలు స్వీకరిస్తూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించారు. తిరుపతి జిల్లా శెట్టిపల్లి పోరాట కమిటీ నాయకులు చంద్రబాబును కలిసి శెట్టిపల్లి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.నాయకులు రాధాక్రిష్ణ, క్రిష్ణ, ఎన్‌డి శ్రీను చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు.

– గుడిపల్లి మండలం చిన్నగొల్లపల్లి పంచాయతీ పెద్దగొల్లపల్లి గ్రామానికి చెందిన విజయరాజు మూగ చెవిటి (22) గత ఏడాది కొబ్బరిచెట్టు ఎక్కి కిందపడి వెన్నుమొక విరిగింది. ఐదు లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని తెలిపారు. పింఛన్, మూడు చక్రాల మోటార్ సైకిల్ మంజూరు చేయాలని సిఎంను కోరారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తెస్తా
మిల్క్, సిల్క్, హనీ ఉత్పత్తులకు ప్రాధాన్యత
రెండో రోజు అధికారులతో చంద్రబాబు సమీక్ష

ముద్దులొలికే చిన్నారికి నామకరణం చేస్తూ...

– వి.కోటకు చెందిన కల్యాణ్ (21) గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో మంచానికే పరిమితం అయ్యాడు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేయాలని అర్జీని, మెడికల్ బిల్లులను అందజేశారు.

అత్యున్నత ప్రమాణాలతో కుప్పం బస్టాండ్

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు దేశంలోనే అత్యున్నతమైన ప్రమాణాలు కలిగిన బస్టాండ్‌గా నిర్మిస్తామని రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం కుప్పం ఆర్టీసీ బస్టాండ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జి.రవివర్మ, చంద్రశేఖర్, జి.వెంకటేశ్వరరావు, చీఫ్ సివిల్ ఇంజనీర్ యు.శ్రీనివాస్, రీజినల్ మేనేజర్ జితేంద్రనాథ్‌రెడ్డిలతో కలిసి ఐదు కొత్త ఆర్టీసీ బస్సులను మంత్రి ప్రారంభించారు. అనంతరం బస్టాండ్‌ను, డిపోను, గ్యారేజిని పరిశీలించారు. గతంలో రద్దుచేసిన 30 సర్వీసులను పునరుద్ధరించినట్లు ప్రకటించారు. రాబోయే రోజుల్లో కుప్పం నుంచి తమిళనాడు, కర్నాటక, తెలంగాణా రాష్ట్రాలకు సర్వీసులు నడపనున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక కమిటీని వేసి కర్నాటక, తెలంగాణా రాష్ట్రాల్లో ఉచిత బస్సు ప్రయాణ అమలు తీరు పరిశీలించి అమలు చేస్తామన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి కుప్పం నుంచి హైదరాబాద్‌కు, గురువారం ఉదయం 5 గంటలకు కుప్పం నుంచి నెల్లూరుకు వెళ్లే బస్సులను జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డి వై సి యం ఈ. నాగేశ్వరరావు, డిపో మేనేజర్ పెంచాలయ్య పాల్గొన్నారు.

సాదర వీడ్కోలు

రెండు రోజుల పర్యటన కుప్పం నియోజకవర్గంలో ముగించుకున్న సిఎం చంద్రబాబునాయుడు అభిమానులకు అభివాదం చేస్తూ, తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు పిఇఎస్ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి బెంగుళూరుకు బయల్దేరి వెళ్లారు. రాష్ట్ర రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, అనంపురం రేంజి డిఐజి పిమోషి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌పి మణికంఠ చందోలు, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, ఎంఎల్ఎలు, ఆర్‌డిఒ శ్రీనివాసులు వీడ్కోలు తెలిపిన వారిలో ఉన్నారు.

గుడిసెలను కూల్చి... గుండెకోత మిగిల్చి..

పెట్లూరు పేదలపై 'ఫారెస్టు' దాష్టీకం
దీర్ఘకాలికంగా బాధితుల భూపోరాటం

ప్రజాశక్తి - వెంకటగిరి

'వాళ్లేమీ తాజ్‌మహల్ కట్టివ్వమని అడగడం లేదు.. కనీసం విశాఖ రిషికొండలో జగన్మోహన్‌రెడ్డి ప్యాలెస్ కావాలనీ కోరడం లేదు.. కేవలం ఉండటానికి రెండు సెంట్ల స్థలాన్నే కోరుతున్నారు.. ప్రభుత్వాన్ని అడిగి అడిగి విసిగి వేసారిపోయారు.. చివరకు కొన్నాళ్ల క్రితం మేత పోరంబోకు భూమిలో 300 మంది గుడిసెలు వేసుకుని, అక్కడే వంటా వార్పు చేసుకుంటూ బతుకు జీవనం సాగిస్తున్నారు. ఎన్నికల వరకూ మిన్నకుండిన అధికారులు, ఎన్నికలైన తరువాత విజృంభించారు.. గుడిసెలను కూల్చివేశారు.. పేదలకు గుండెకోత మిగిల్చారు.. వాళ్లంతా అడుగుతున్నది ఒక్కటే ఉండటానికి జానెడు జాగా.. జాయింట్ సర్వే చేసి ఇవ్వాలని కోరుతున్నారు. తాము గుడిసెలు వేసుకుని ఉంటున్న జాగా ఫారెస్టుది అయితే, జగనన్న కాలనీకి ఎలా కేటాయిస్తారన్నదే వారి మిలీనియం ప్రశ్న. ఈ ప్రశ్నకు అధికారులు నీళ్లు నమలడం తప్ప సమాధానం చెప్పే పరిస్థితి లేదు. జాయింట్ సర్వే పేరుతో ఏళ్ల తరబడి పేదల సమస్యను నానుస్తూనే ఉండటం ఇక్కడి 'రెవెన్యూ' అధికారుల స్పెషల్.

పేదలకు న్యాయం చేయాలి : వడ్డిపల్లి చెంగయ్య

మండలంలోని పెట్లూరు గ్రామ పంచాయతీ 12 సర్వేనంబర్ 1లో మేత పోరంబోకు స్థలం ఉంది. ఎంతోకాలంగా చెట్టుపుట్ట కొట్టి సాగు చేసుకుంటుంటే ఫారెస్టు అధికారులు తమదని వెళ్లిన ప్రతిసారీ తరుముతూనే ఉన్నారు. తమకు న్యాయం చేయాలని బుధవారం తహశీల్దార్ సాంబశివరావుకు వినతిపత్రం అందజేశాం. ఫారెస్టు అధికారులు తమ వద్ద ఎలాంటి ఆధారాలను చూపకుండా అది ఫారెస్టుదని చెప్పడం సరికాదని, 2012లో నెల్లూరు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ జాయింట్ సర్వే చేసి పట్టాలివ్వాలని చెప్పినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారే తప్ప పేదలకు న్యాయం చేయలేదని వేడుకొన్నారు. ఉన్నపళంగా వచ్చి తమ గుడిసెలను కూల్చివేసి దాష్టీకం ప్రదర్శించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. జాయింట్ సర్వే నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మా పోరాటం ఆగదు : చేజర్ల రమణయ్య



2004వ సంవత్సరం నుండి ఈ భూమిని చదును చేసుకుని గతంలో పంట కూడా వేశాం. ఫారెస్ట్ అధికారులు మాపై దౌర్జన్యం చేస్తూనే ఉన్నారు. గుడిసె నిర్మించుకుంటే మాపై దౌర్జన్యం చేసి తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది అన్యాయం కదా అంటే కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారు. ఇది ఫారెస్ట్ భూమి అయితే జగనన్న కాలనీకి ఏ విధంగా ఇచ్చారు. జాయింట్ సర్వే నిర్వహించి పేదలకు పట్టాలు ఇచ్చేవరకూ మా పోరాటం ఆగదు.

పేదలపైనే ఈ జులుమంతా : కె.దేవమ్మ

పేదలపైనే ఈ జులుమంతా.. అదే పెద్దలు వందల ఎకరాలు ఆక్రమించుకుంటున్నా పట్టించుకోరు.. ఎన్నో ఏళ్లుగా అనుభవిస్తున్న భూమికి పట్టాలివ్వాలని కోరుతుంటే ఫారెస్టోళ్లు ప్రతిసారీ దాడులు చేసి బెదరగొడుతున్నారు. గత 14ఏళ్లుగా భూమిని చదును చేసుకుని గుడిసె నిర్మించుకుని ఉంటున్నా. మా గుడిసెలను పీకేయడానికి వచ్చారు. పేదలంటే ఈ ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు. కూటమి ప్రభుత్వమైనా జాయింట్ సర్వే నిర్వహించి పేదలకు న్యాయం చేయాలి.

ఆన్‌లైన్‌లో మేత పోరంబోకుగా ఉన్నా... : తహశీల్దార్

పెట్లూరు గ్రామ సర్వే 12లో ఉన్న భూమి రిజర్వు ఫారెస్టుకు చెందుతుందని, మీ భూమి ఆన్‌లైన్‌లో మేత పోరంబోకుగా ఉన్నా అధికారిక రికార్డుల ప్రకారం ఫారెస్టుదని తెలిపారు. రీజియన్ రేంజర్ రాజేంద్రప్రసాద్‌తో చర్చించి చెబుతున్నానన్నారు. పేదలకు పట్టాలివ్వాలంటే చట్టపరంగా ఇస్తామన్నారు.

రికార్డుల్లో మాదనే ఉంది : రాజేంద్రప్రసాద్, ఫారెస్టు రేంజి అధికారి

ఆ భూమి రిజర్వు ఫారెస్టు భూమిగానే మా రికార్డుల్లో ఉంది. మా భూమిలో ఆక్రమణ జరిగింది. త్వరలోనే జాయింట్ సర్వే నిర్వహించి గుడిసెలను తొలగిస్తాం.

గుడిసెల కూల్చివేతను అడ్డుకుంటున్న పేదలు

పేదలకు న్యాయం చేయాలని వినతి

పక్షవాతం లక్షణాలను వెంటనే గుర్తిస్తే...

ప్రజాశక్తి - తిరుపతి సిటి

పక్షవాతం ఒక అత్యవసర స్థితి అని, పక్షవాతం వచ్చిన రోగి మూడు గంటలలో న్యూరాలజిస్టును సంప్రదిస్తే పక్షవాతాన్ని పూర్తిగా నయం చేసే అవకాశాలు ఉన్నాయని ప్రముఖ మెదడు వెన్నుపూస, నరాల వైద్య నిపుణులు డాక్టర్ ఎం రేవంత్ రెడ్డి తెలిపారు. స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీ లో గల రేవంత్ న్యూరో కేర్ హాస్పిటల్ నందు డాక్టర్ రేవంత్ రెడ్డిని 'ప్రజాశక్తి' సంప్రదించగా పలు విషయాలు వెల్లడించారు. పక్షవాతం మొదటి మూడు గంటల్లో నయం చేయాలంటే అందుకు తగిన లక్షణాలను మొదట్లోనే గుర్తించడం చాలా ముఖ్యం. ఉన్నట్టుండి మాట తడబడినా, మూతి వంకర పోయినా, ఒక వైపు చెయ్యి కాలు రాకుండా తిమ్మిర్లు పట్టినట్లు అనిపించినా ఉన్నట్టుండి చూపు కనపడకుండా పోయిన, నడవడంలో బ్యాలెన్స్ తప్పిన పక్షవాతం వచ్చిందని గుర్తించాలి. ఈ లక్షణాలు కనిపించిన మొదటి మూడు గంటల్లో న్యూరాలజిస్టును సంప్రదిస్తే వెంటనే మెదడును స్కాన్ చేసి రక్తపు గడ్డలు కరిగించే మందు ఇవ్వడం ద్వారా నయం చేయవచ్చు. మెదడులో ఒక భాగానికి ఉన్నట్టుండి రక్తప్రసరణ ఆగిపోతే పక్షవాతం వస్తుంది. సాధారణ ప్రజలతో పోలిస్తే మధుమేహం రక్తపోటు ఉన్న వారిలో, ఊబకాయం ఉన్నవారిలో పక్షవాతం వచ్చే అవకాశాలు ఉంటాయి. అలాగే వంశపారపర్యంగా వచ్చే అవకాశం ఉంది. మధుమేహం, రక్తపోటు అదుపులో ఉంచుకోవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, వ్యాయామం, సరైన ఆహార నియమాలు పాటించడం ద్వారా పక్షవాతం రాకుండా చేసే అవకాశం ఉంది. పక్షవాతం వచ్చిన రోగులు చెయ్యి కాలు బాగా రావడానికి ఫిజియోథెరపీ చేసుకోవడం, డాక్టర్ పర్యవేక్షణలో మందులు వాడటం ద్వారా సాధారణ జీవనశైలిని తిరిగి పొందవచ్చు. నాటుమందులు, పసరుమందులుపై ప్రామాణిక పరీక్షలు జరగనందున శాస్త్ర సమ్మతం కాదు. రేవంత్ న్యూరో కేర్ హాస్పిటల్ లో అత్యాధునిక న్యూరాలజీ సేవలు ఇప్పుడు తిరుపతిలో అందుబాటులో ఉంది. సంప్రదించు నెంబరు 9912806086, 0877 2226086.

మొదటి మూడు గంటలు అమూల్యం : డాక్టర్ రేవంత్ రెడ్డి

డా॥ ఎమ్. రేవంత్ రెడ్డి

డా॥ ఎస్. సుధీర

ప్రత్యేక వైద్య చికిత్సలు : పక్షవాతం , మూర్ఛ వ్యాధి , మైగ్రేన్ తలనొప్పి, టెన్షన్ తలనొప్పి, అన్ని ఇతర రకాల తలనొప్పులు నరములు, కండరాల బలహీనత, కాళ్ళు చేతులు తిమ్మిర్లు మంటలు, చక్కెర వ్యాధి సంబంధం నరాల జబ్బు, మెడ నడుము నరములు లాగుట, కళ్ళు తిరుగుట స్పృహ కోల్పోవటం, మూతి వంకర పోవుట, మెదడు వెన్నుపూస ఇన్ఫెక్షన్లు, చేతులు కాళ్లు వణుకుట , నిద్ర సమస్యలు, మయస్తీనియ గ్రేవిస్, మల్టిపుల్ స్క్లిరోసిస్, మోటార్ న్యూరాన్ వ్యాధి వంటి వాటికి ప్రత్యేకమైన అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

ఎస్వీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్య

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఇన్చార్జి రిజిస్ట్రార్ గా బి. చంద్రయ్య నియమితులైనట్లు పరిపాలన భవనం ఒక ప్రకటనలో తెలిపింది. యూనివర్సిటీలోని యూజీసీ విభాగంలో జాయింట్ రిజిస్ట్రార్ గా ఎంతో కాలంగా పరిపాలన అనుభవం కలిగిన బి.చంద్రయ్య కు వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి.శ్రీకాంత్ రెడ్డి ఇంచార్జ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. ఇటీవల అనివార్య కారణాలవల్ల ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న భౌతిక శాస్త్ర విభాగపు ఆచార్యులు ఓఎండి హుస్సేన్ రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. దీంతో గత పది రోజులుగా వర్సిటీ పరిపాలన భవనంలో ఎటువంటి ఆర్థికపరమైన కార్యకలాపాలు, పరిపాలనా పరమైన కార్యకలాపాలు జరగకపోవడంతో పరిపాలన స్తంభించిన విషయం విదితమే. యుజిసి విభాగంలో జాయింట్ రిజిస్ట్రార్ బి.చంద్రయ్యకు ఇన్చార్జి రిజిస్ట్రార్‌గా పదోన్నతి లభించడం పట్ల బోధన, బోధనేతర ఉద్యోగుల ప్రెసిడెంట్ పికె సుబ్రహ్మణ్యం, సెక్రటరీ సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రెటరీ చంద్రశేఖర్, హాస్టల్ టెక్నికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్ సింగ్, మాజీ ప్రెసిడెంట్ నాగరాజు, మాజీ సెక్రటరీ రవిచంద్ర, ఎన్‌ఎమ్ఆర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగదీష్, రూస సీఈవో వంశీకష్ణ, అకాడమీక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు.

లా కాలేజీలపై బీసీఐ కొరఢా

ఎఐఆర్‌తో పాటు, షిర్డీసాయి లో ప్రవేశాలు రద్దు
నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయంటూ ఆంక్షలు

ప్రజాశక్తి - తిరుపతి

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న లా కాలేజీలపై బీసీఐ (బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) కొరఢా ఝులిపించింది. తిరుపతి జిల్లాలోని ఏర్పేడు మండలం, అంజిమేడు వద్ద ఏర్పాటు అయిన అగరాల ఈశ్వర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ లా తోపాటు, విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలోని గవరపాలెంలో ఉన్న శ్రీ షిరిడిసాయి విద్యాపరిషత్ ఆధ్వర్యంలోని శ్రీ షిరిడిసాయి లా కాలేజీ లో ప్రవేశాలను రద్దు చేసింది. ఈ మేరకు అధికారక ప్రకటన విడుదల చేసింది.

ఏపీలోని లా కాలేజీల్లో 2024-25 విద్యాసంవత్సర ప్రవేశాలకు సంబంధించి జూన్ 9న ఏపీ లాసెట్/ పీజీఎల్‌సెట్ 2024 ప్రవేశ పరీక్షను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించింది. పరీక్షకు సంబంధించిన ప్రాథమిక ఆన్సర్ కీని జూన్ 10న విడుదల చేసింది. అభ్యర్థుల నుంచి జూన్ 11, 12 వ తేదీల్లో ఆన్సర్ కీపై అభ్యంతరాలు స్వీకరించింది. ఈ ప్రక్రియ పూర్తవడంతో ఫలితాల వెల్లడికి ఉన్నతవిద్యామండలి ఏర్పాట్లు చేస్తోంది. ఇదే సందర్భంలో అగరాల ఈశ్వర్ రెడ్డి కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా పరీక్ష నిర్వహణ, కాపీయింగ్ విషయంపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదులు వెల్లువెత్తినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మొదట్లో సెమిస్టర్ పరీక్షల నిర్వహణలోనూ కాపీయింగ్ కు పాల్పడడంతో స్వయంగా తిరుపతి జిల్లా కలెక్టర్ స్పందించారు. రేణిగుంట తహసీల్దార్ ను ఆకస్మిక తనిఖీలకు పంపి రిపోర్టును బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కు పంపారు. ఇలాగే వైజాగ్ లోని షిరిడి సాయి లా కాలేజ్ పైన పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చింది. ఈ నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్లో ఈ రెండు కళాశాల పైన బిసిఐ నిషేధం విధించడం గమనార్హం. అలాగే దేశవ్యాప్తంగా మొత్తం 7 కళాశాలల్లో ఈ ఏడాది (2024-25) ప్రవేశాలను రద్దుచేయగా ... నాలుగు యూపీ కాలేజీలే కావడం గమనార్హం.

ఎర్రచందనం ఆపరేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ : హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి చేపట్టే ఆపరేషన్లపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని తిరుపతి జిల్లా ఎస్పీ, టాస్క్ ఫోర్స్ ఇన్ చార్జి వి. హర్షవర్ధన్ రాజు సూచించారు. టాస్క్ ఫోర్స్ ఇన్చార్జిగా అదనపు బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో బుధవారం తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్ద వున్న టాస్క్ ఫోర్స్ కార్యాలయంను హర్షవర్ధన్ రాజు సందర్శించారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ హర్షవర్ధన్ రాజుకు పుష్పగుచ్చంతో స్వాగతం పలికి టాస్క్ ఫోర్స్ కార్యకలాపాలను వివరించారు. అడవులలో టాస్క్ ఫోర్స్ బందాలు చేపట్టే కూంబింగ్, సమాచార వ్యవస్థల గురించి వివరించారు. టాస్క్ ఫోర్స్ అడవులలో చేపట్టే కూంబింగ్ కార్యక్రమాలలో అటవీశాఖ సిబ్బంది సేవలను విరివిగా వినియోగించుకోవాలని ఇన్చార్జ్ హర్షవర్ధన్ రాజు టాస్క్ ఫోర్స్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తిరుపతి టాస్క్ ఫోర్స్ కార్యాలయంతో పాటు, కడప, రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ సిబ్బంది, టాస్క్ ఫోర్సు డీఎస్పీ చెంచుబాబు, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐలు సురేష్ కుమార్ రెడ్డి, కపానంద, చిరంజీవులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం సరస్వతి కండ్రిగలో పామాయిల్ తోటల పెంపకంపై త్రీ ఎఫ్ ఆయిల్ ఫామ్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏజీఎం మురళి మాట్లాడుతూ పామాయిల్ తోటల పెంపకం చేపడితే వచ్చే లాభాలు, రాయితీలపై అవగాహన కల్పించారు. శ్రద్ధ ఉన్న రైతులు ఉద్యాన శాఖాధికారి పుష్పలత 7995086968, ఏజియమ్ త్రీఎఫ్ ఆయిల్ ఫామ్ 8688826699, గురునాథం ఏర్పేడు క్లస్టర్ ఆఫీసర్ 8897084409, రాజేష్ క్లస్టర్ మేనేజర్ 9014166168 ఫోను నెంబర్ల ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పురపాలక సంఘ కార్యాలయ నూతన భవన సమావేశ మందిరంలో ఈ నెల 27వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు ఛైర్ పర్సన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు పురపాలక సంఘ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశానికి వైస్ ఛైర్‌పర్సన్, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కమిషనర్ పేర్కొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గాంధీనగర్ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే సునీల్‌కుమార్ బుధవారం పంపిణీ చేశారు. గాంధీ నగర్‌ను ఎమ్మెల్యే సునీల్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. స్థానిక అధికారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. శ్రీకాళ దత్తాత్రేయుంతో స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. చదువు ద్వారే సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్ రెడ్డి, గూడూరు మండల టిడిపి అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వర్లు రాజు,సురేంద్ర, పెంచలయ్య, రమేష్ రెడ్డి, ఉదయ్, వెంకట కృష్ణయ్య, పటాన్ శివ, శ్రీవర్దన్ రెడ్డి, గుండాల లీలావతి, గుండాల భారతి, శివకుమార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ముక్కంటి ఆలయ అధికారులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, మల్లికార్జున ప్రసాద్, ఏకాంబరం, ఎంఈవో అంజలి బాలయ్య పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో తప్పి పోయిన ఐదేళ్ల బాలుడిని వారి తల్లిదండ్రులకు తిరిగి అప్పగించారు శ్రీకాళహస్తి స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు. స్కౌట్స్ మాస్టర్ ఉప్పు సుబ్రహ్మణ్యం బుధవారం నాగలాపురం వెళ్లేందుకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కు వెళ్లగా తల్లితండ్రుల నుంచి తప్పిపోయి ఏడుస్తున్న ఐదేళ్ల బాలుడిని గుర్తించారు. ఆ విషయాన్ని స్కౌట్ డ్రైవర్ షేక్ అజారుద్దీన్ కు తెలుపగా సామాజిక మాధ్యమాల్లో బాలుడి ఫొటోలను వైరల్ చేయడంతో అరగంటలో సమాచారం తల్లిదండ్రులకు అందింది. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో పట్టణ సీఐ నరసింహారావు సమక్షంలో చిన్నారిని తండ్రి సుబ్బరాజుకి అప్పగించారు.

పాత పింఛను విధానం అమలు చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛను విధానం అమలు చేయాలని ఏపీసీపీఎస్ ఈఏ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రికి విన్నవించారు. కుప్పం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును బుధవారం ఈ సంఘం నేతలు కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీపీఎస్ ఈఏ తిరుపతి జిల్లా అధ్యక్షులు ఆర్.దేవానంద్, ప్రధాన కార్యదర్శి పి.వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్, సంయుక్త కార్యదర్శి బి. శ్రీనాథ్, శ్రీకాళహస్తి అధ్యక్షులు వి. గంగయ్య పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన మమత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కూటమి ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్ ను అమరావతి సచివాలయంలోని క్యాంపు కార్యాలయంలో తిరుపతి ముత్యాలరెడ్డి పల్లె గ్రామపంచాయతీ మాజీ సర్పంచి బోయనపాటి మమత మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ కు తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

డయేరియా నియంత్రణకు చర్యలు చేపట్టాలి : కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : నగర పాలక సంస్థ పరిధిలో డయేరియా ప్రబలకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ తెలిపారు. బుధవారం రఘునాథరెడ్డి కాలనీ, ఎస్టీవి నగర్, రైతుబజారు పక్కన ఉన్న వాటర్ ట్యాంక్, సీతమ్మనగర్ ఏరియా, రిజర్వాయర్ కాలనీ, చిన్నబజారువీధి, గాంధీరోడ్డు ప్రాంతాల్లో నీటి కుళాయిలు, వాటర్ ట్యాంక్‌లను, సంపులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. నీటి కాలుష్య పరీక్షలు నిర్వహించాలని, క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. లీకేజీలు ఎక్కడైనా ఉంటే వెంటనే నియంత్రించాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమలిక మోహన్ వున్నారు.

లైంగిక వేధింపులపై అంతర్గత కమిటీలు వేయాలి

మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ యోగేష్ దూబె

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలు లైంగిక వేధింపులపై అంతర్గత కమిటీలు వేసి పర్యవేక్షించాలని మానవహక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ యోగేష్ దూబె అన్నారు. సఖి వన్ స్టాప్ సెంటర్ రానున్న రోజుల్లో మరిన్ని సదుపాయాలతో ఆదర్శప్రాయమైన సెంటర్‌గా సేవలందించాలన్నారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సఖి – వన్ స్టాప్ కేంద్రంలో వచ్చే ప్రతి మహిళ, బాల బాలికలను తమ కుటుంబ సభ్యులుగా భావించి వారికి అన్ని విధాల అండదండగా నిలిచి వారికి సహాయ సహకారాలు అందించి భరోసా కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సఖి వన్ స్టాప్ సెంటర్ 181 టోల్ ఫ్రీ నెంబర్ కు ఇంటిగ్రేట్ చేశారని అధికారులు తెలిపారు. ముఖ్యంగా మహిళలతో పాటు 18 సంవత్సరాల లోపు బాలికలు జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్, 2000 , ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్, 2012 కింద వచ్చే బాధితులకు అండగా నిలవడం అని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, అదనపు ఎస్పీ వెంకట్రావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి ఎస్ జయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి డా. వి. శేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, సఖి వన్ స్టాప్ సెంటర్ సెంటర్ అడ్మిన్ సుజాత, గృహ హింస చట్టం విభాగం కౌన్సిలర్ సుగుణ తదితర అధికారులు పాల్గొన్నారు.

అక్రమ భవన నిర్మాణానికి నోటీసులు

'ప్రజాశక్తి' వార్తకు 'స్పందన'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సప్తగిరి కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలోని బిటిఆర్ కాలనీ సప్తగిరి కాలనీ మధ్య ఉన్న ప్రధాన మార్గానికి ఆనుకుని పంచాయతీ నుండి గాని, తుడా నుండి గాని ఎటువంటి అనుమతులు తీసుకోకుండా బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించడంతో నిర్మాణ దారుడు శేఖర్‌కు పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 21న 'ప్రజాశక్తి' దినపత్రికలో 'అనుమతులు మీరి... మిద్దెల నిర్మాణం' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. గ్రామపంచాయతీ పరిధిలో జి ప్లస్ 2 వరకు మాత్రమే పంచాయతీ అనుమతులు జారీ చేస్తుందని, తదుపరి అనుమతులు బహుళ అంతస్తులకు తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ మాత్రమే అనుమతులు ఇస్తుందని పంచాయతీ కార్యదర్శి స్పష్టం చేశారు. నోటీసుకు స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

భూస్వాములకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలి

సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : భూస్వాములకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకటేష్ డిమాండ్ చేశారు. వడమాల పేట మండలం యనమల పాల్యం దళితులకు భూములను కేటాయించాలని కోరుతూ వడమాల పేట మండలంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అక్కడి నుంచి సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీగా మండల తహశీల్దారు కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడమాలపేట మండలంలోని యనమల పాలెం దళితవాడలో తిరుమండ్యం లెక్కదాకలాలో 195–మూడులో ఐదు ఎకరాల 12 సెంట్లు 1975లో వారికి పట్టాలు ఇచ్చారని, ఆ భూములను భూస్వాములు ఆక్రమించుకుని భూములకు ఇప్పటి వడమాలపేట తహశీల్దారు పట్టాలు ఇవ్వడం దారుణ మన్నారు. వెంటనే ఆ పట్టాలను రద్దు చేయాలని యనమల పాలెం దళితులకు ఆ భూములను కేటాయించాలని కోరారు. తహశీల్దారును సస్పెండ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వడమాలపేట సిఐ జోక్యం చేసుకుని తహశీల్దారు, ఆర్డీవోతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి వై నందయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామస్తులు ముని బాల, దాము, నాదముని, ధనంజయులు మహిళలు పాల్గొన్నారు.

సిండికేట్ కాలేదనే..తోపుడు బండి వ్యాపారిపై దౌర్జన్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం ప్రధాన రహదారి ఆర్టీవో కార్యాలయం కూడలి సమీపంలో బిటిఆర్ పురానికి చెందిన మురళి అనే వ్యక్తి తోపుడు బండిపై బిర్యాని అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండేళ్లుగా తోపుడు బండిపైనే బిర్యానీ, కుష్కా అమ్ముతూ పొట్ట పోసుకుంటున్న అతనిపై బుధవారం స్థానికంగా ఉండే కొందరు హోటల్ నిర్వాహకులు తామంతా ఒక ధరకు బిర్యాని అమ్ముతుంటే, 'నువ్వెలా తక్కువ ధరకు ఇస్తావ్..'అంటూ నిలదీసి అతనిపై దౌర్జన్యం సాగించారు. తాను రోడ్డుపై వ్యాపారం చేస్తున్నానని, హోటల్లలా సౌకర్యాలు ఏమి లేనందున తనకు బిర్యానీ తయారీకి అయ్యే ఖర్చు, స్వల్ప ఆదాయాన్ని జోడించి 110 రూపాయలకు బిర్యానీ అమ్ముతున్నాని చెప్పారు. అయితే 130 రూపాయలకు తామంతా విక్రయిస్తుంటే.. నువ్విలా విక్రయించడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఇక చేసేదేమీ లేక తోపుడు బండి వ్యాపారి మురళి 130 రూపాయలకే అమ్ముతానని వారితో చెప్పడంతో వారు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న 'ప్రజాశక్తి' మురళి బండి వద్దకు వెళ్లి ఆరా తీయగా తనను ఇక్కడి నుండి ఎలాగైనా తరిమేయాలని చూస్తున్నారని, 15 రోజులకు మునుపు కొందరు వచ్చి ముందు రోజులు వేరు...ఇప్పుడు(అధికారం మారి) రోజులు వేరు ఇక్కడ నుండి బండి తీసేయాలని బెదిరించారని, బండిని కాల్చి దగ్ధం చేస్తామని బెదిరించారన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు

ప్రజాశక్తి - వరదయ్యపాళెం: ఏపి దర్శన్ స్టడీ టూర్‌లో భాగంగా 2023 బ్యాచ్ కు చెందిన ఆరుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు (అసిస్టెంట్ కలెక్టర్లు శిక్షణలో వున్న) బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వీరికి సాదర స్వాగతం పలికారు. వారితో చర్చల సందర్భంగా, పారిశ్రామిక వృద్ధి, సుస్థిర పర్యావరణ వ్యవస్థ, సామాజిక బాధ్యతను సమన్వయం చేయడం ద్వారా ప్రపంచ స్థాయి వ్యాపార గమ్యస్థానంగా శ్రీసిటీ మారిందని ఆయన వ్యాఖ్యానించారు. స్థానిక ప్రజల ప్రమేయంతో ఈ ప్రాంత వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను పారిశ్రామిక కేంద్రంగా శ్రీసిటీ ఎలా విజయవంతంగా మార్చిందో వివరించారు. మెగా పారిశ్రామికవాడ అభివృద్ధి పయనం, ఎదుర్కొన్న సవాళ్లతో పాటు శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, ప్రగతి, ప్రత్యేకతలపై ప్రదర్శన ఇచ్చారు.

29న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి: జడ్జి

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఈనెల 29వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. పట్టణం లోని కోర్టు ఆవరణలో న్యాయవాదులతో జడ్జి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని దాని పై అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని విషయాన్ని కక్షిదారులకు తెలపాలని, లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలను కక్షి దారులకు తెలిపి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని కోరారు. నేడు అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం అని మాదక ద్రవ్య నిర్మూలన, మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలు తెలుసుకోవాలని, వాటి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. ఈ సదస్సులో జూనియర్ సివిల్ జడ్జి జానకి, అదనపు జూనియర్ జడ్జి గోపాల్ కృష్ణ, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు కె పురుషోత్తం, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాఠశాలను పున:ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కెవిబిపురం మండలం కళత్తూరు పంచాయతీలోని ఎస్–ఎల్ పురంలో మండల విద్యాశాఖాధికారి లక్ష్మీపతి , రవికుమార్ ఆధ్వర్యంలో గత ప్రభుత్వంలో మూసి వేసిన పాఠశాలను పున: ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు లాంటి విజన్ ఉన్న నాయకుడు ఇంత వరకు చూడలేదని మెగా డిఎస్‌సిపై మొదటి సంతకం చేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పడం ఆనందంగా వుందన్నారు. అందులో భాగంగానే ఎస్ ఎల్ పురంలోని పాఠశాలను పున: ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంటు రైతు సంఘం అధ్యక్షులు కనపర్తి గోపీనాథ్ రెడ్డి , రాష్ట్ర బీసీ కార్యదర్శి మునిస్వామి యాదవ్, నాయకులు కిషోర్ కుమార్ రెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి ఏబిఆర్‌ఎస్‌ఎం వినతి

ప్రజాశక్తి - క్యాంపస్ : అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని పలువురు నాయకులు మంత్రి లోకేష్‌ను కోరారు. ఏబిఆర్‌ఎస్‌ఎం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ తరపున రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి.రామిరెడ్డి ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎం బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శరత్ కుమార్ తదితరులు అమరావతిలో నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న నారా లోకేష్ ని కలిసి అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న దాదాపు 5వేల అధ్యాపకుల ఖాళీలను, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని 2 వేల ఖాళీలను, ఇంటర్మీడియట్ కళాశాలలో ఉన్న 3,500 ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. 2015 నుండి కేవలం నెలకు పదివేల రూపాయలు జీతంతో గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి ఉపన్యాసకులకు కనీస జీతం 30వేలుగా నిర్ణయించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు కెరీర్ అడ్వాన్సుడ్ స్కీం కింద ప్రమోషన్లు చేపట్టాలని, డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞాపన పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్న సమస్యలను వీలైనంత తొందరలో పరిష్కరించే దానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఏ రంగంపేట అటవీశాఖ డిఆర్‌ఓగా ఎస్ వేణు

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): ఏ రంగంపేట అటవీ శాఖ డిఆర్‌ఓగా ఎస్ వేణు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డిఆర్‌ఓ చక్రపాణి ఉద్యోగ విరమణ పొందడంతో డిఆర్‌ఓ పోస్ట్ ఖాళీ అయ్యింది. పీలేరు రేంజిలో సెక్షన్ ఆఫీసర్ గా పని చేస్తున్న ఎస్ వేణు ఉద్యోగోన్నతి పై ఏ రంగంపేటకు బదిలీ అయ్యారు. సి సి ఎఫ్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఏ రంగంపేట డిఆర్‌ఓగా ఎస్ వేణు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు అటవీ శాఖ సిబ్బంది వేణుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ వేణు మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి సమర్థ వంతంగా విధులు నిర్వర్తిస్తానని తెలిపారు. అటవీ వనరుల సంరక్షణ ధ్యేయంగా సిబ్బంది పని చేయాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పాకాల మండలంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పాకాల మండలంలోని దామల చెరువు సమీపంలోని చెరువు గట్టున గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం రాత్రి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మృతుడు పాత ప్లాస్టిక్ పేపర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ ఉండేవాడని, రాత్రి మద్యం ఎక్కువగా తాగడం వల్లే మృతి చెంది వుంటాడని స్థానికులు పేర్కొన్నారు. మృతుడి వయసు 45 సంవత్సరాలు వుంటుందని, పూర్తి వివరాలు తెలియాల్సి వుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జింకను వేటాడి చంపిన వేటగాళ్లు అరెస్ట్

ప్రజాశక్తి- వరదయ్యపాళెం: వరదయ్య పాళెం కదూరు అటవీ ప్రాంతంలో అడవి జంతువులను వేటాడిన ఇద్దరిని ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. అటవీ శాఖ అధికారుల కథనం మేరకు వెంగాల్రెడ్డి కండ్రిగ చెరువులో ఇద్దరు వ్యక్తులు అడవి జంతువులను వేటాడారనే సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వరదయ్య పాళెం మండలం నక్కల కాలనీకి చెందిన శరత్ కుమార్ మాదన పాళెం గ్రామానికి చెందిన రామకృష్ణ గుర్తించారు. చుక్కల దుప్పి, నాటు తుపాకి, మందు గుండు సామగ్రి కలిగిన చిన్న బ్యాగు, ఒక ద్విచక్ర వాహనం వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని జింక వేట విచారణ నిమిత్తం ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి సత్యవేడు రేంజ్ కార్యాలయానికి తరలించారు. అనంతరం కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెంగల్రాయ నాయుడు ఎఫ్ బీ ఓ శివయ్య ఎఫ్ ఎస్ ఓ కంబకం, మస్తాన్ ఎఫ్‌బిఓ కంబకం, రెడ్డప్ప ఎఫ్‌బిఓ పాండూరు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి పీలేరు సమీపంలో తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించి నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని ఒక కారును సీజ్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డి ఎఫ్ ఓ శివకుమార్ కు వచ్చిన సమాచారం మేరకు పీలేరు గవర్నమెంట్ ఐటిఐ కాలేజ్ సమీపంలో సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ఏపీ 31 ఏడబ్ల్యూ 84 33 నంబర్ గల స్విఫ్ట్ డిజైర్ వాహనం అనుమానాస్పదంగా రావడం సిబ్బంది గమనించి వాహనాన్ని ఆపే ప్రయత్నం చేయగా ఆపకుండా వెళ్లిపోయిందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు కారును వెంబడించడంతో రోడ్డు పక్కగా వాహనాన్ని వదిలి కొందరు పొదల్లోకి పారిపోయారన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా నాలుగు ఎర్రచందనం దుంగలు ఉన్నాయన్నారు. వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం 128.5 కేజీల బరువు ఉందని డిఎఫ్‌ఒ శివకుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది కోదండన్, చంద్రబాబు, సాయి కిరణ్, నాగులయ్య స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది భార్గవ్ వినీల్ కుమార్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఇటీవల అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆదుకుంటామని ఈ మేరకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నామని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు మండల పరిధిలోని రామలింగాపురంలో ఇటీవల అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ' ప్రభుత్వం మీకు అండగా వుంటుంది..' అని ప్రకటించారు. ఈ క్రమంలో లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు. విద్యార్థిని చదువులకు అవసరమైన ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అత్యాచారానికి పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారని, పోలీసులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రభుత్వంలో తప్పు చేసిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడుతుందని హెచ్చరించారు. గత ప్రభుత్వం లాగా తప్పు చేసిన వారిని వెనకేసుకొచ్చే సంస్కృతి లేదని పేర్కొన్నారు. అనంతరం గ్రామాన్ని పరిశీలించి అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి , చాంద్ బాషా, వెంకటేశ్వర్లు రాజు, రంగా రెడ్డి, కృష్ణారెడ్డి, ఎగిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, పెంచల రెడ్డి, నారాయణ రెడ్డి, కార్తిక్ రెడ్డి, నీలం సుబ్బారెడ్డి స్థానికులు పాల్గొన్నారు.

వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గాంధీనగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన వినాయకుని ఆలయానికి గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ బుధవారం వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులు చేయించిన వెండి కిరీటాన్ని ఎమ్మెల్యే ఆలయానికి అందించారు. సునీల్ కుమార్ విజయం సాధిస్తే స్థానిక నాయకులు అన్నదానం నిర్వహిస్తామని మొక్కు కోవడంతో సునీల్ కుమార్ చేతుల మీదగా అన్నదానం ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో నాయకులు నెలబల్లి భాస్కర్ రెడ్డి, గూడూరు మండల టిడిపి అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వర్లు రాజు, సురేంద్ర, పెంచలయ్య, రమేష్ రెడ్డి, ఉదయ్, వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయం

- డాక్టర్లు త్రివిక్రమ్ రావు, కీర్తి ప్రశంస

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయ మని కెవి హాస్పిటల్స్ డాక్టర్లు త్రివిక్రమ్ రావు, కీర్తి ప్రశంసించారు. గురువారం గూడూరు లోని వరదానగర్ గిరిజన కాలనీలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో 15 మంది పేదలకు నెలకు సరిపడ సరకులు అందించారు. దాత పొనకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పొనకా మల్లికార్జునరెడ్డి సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు త్రివిక్రమ్ రావు, కీర్తి మాట్లాడుతూపేదలకు పలు కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. యువత సేవా దృక్పథం అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, కెఆర్ఎం, కుమార్ నాయుడు , ప్రభాకర్, పిల్లెల శ్రీను, పెంచలయ్య, కృష్ణారెడ్డి, ముని, ప్రసాద్ , శ్రీహరి , కళ్యాణి పాల్గొన్నారు.

భౌతికశాస్త్రంలో కామేశ్వరరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి- క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని భౌతికశాస్త్ర పరిశోధకవిద్యార్థి కె. కామేశ్వరరావుకి డాక్టరేట్ ను ప్రదానం చేసినట్లు వర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక శాస్త్రం విశ్రాంత ఆచార్యులు ఎం.కృష్ణయ్య పర్యవేక్షణలో "స్టడీస్ ఇన్ సాలిడ్ స్టేట్ ఫిజిక్స్ : ఎక్స్ రే కృష్ణలోగ్రాఫిక్ స్టడీస్ ఆన్ సమ్ బయోలాజికల్ ఇంపార్టెంట్ కాంపౌండ్స్ " అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. కామేశ్వరరావు పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు తెలిపారు. ప్రస్తుతం కేక్ కామేశ్వరరావు ఎస్వీఆర్సీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా వర్సిటీలోని కామేశ్వరరావుకి పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి..

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని పాకాల ఇన్‌ఛార్జి సిఐ శ్రీరాముడు పేర్కొన్నారు. పాకాల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. బాలుర జూనియర్ కళాశాల నుండి పాకాల బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ వచ్చి కూడలి వద్ద మానవహారం నిర్వహించి మాదకద్రవ్యాల నిర్మూలన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి సిఐ శ్రీరాముడు మాట్లాడుతూ యువతను నిర్వీర్యం చేసే మత్తు పదార్థాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాకాల ఎస్ఐలు లోకేష్ కుమార్, మహేష్ బాబు, ఇషాక్ బాషా, జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు టౌన్ :మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సెబ్ సీఐ రమేష్ హెచ్చరించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలో సెబ్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. విద్యార్థులు మానవహారం నిర్వహించారు. సెబ్ అధికారులు, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మోసెస్,హెడ్ కానిస్టేబుల్ కిరణ్ సింగ్ సిబ్బంది,కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : మత్తు పదార్థాలు వినియోగించడం ద్వారా ఎన్నో అనర్థాలు కలుగుతాయని, వాటిని విడనాడాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలోని ఎస్.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ విజయ మహేష్ పాల్గొన్నారు.

ఎస్‌వియు క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం , ఫార్మాసుటికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పాస్ సంయుక్త ఆధ్వర్యం లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక కోదండ రామస్వామి హైస్కూల్ విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమ కోఆర్డినేటర్ మహిళా అధ్యయన కేంద్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కే . హైమావతి మాట్లాడుతూ ఈ సంవత్సరం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణకు అందరూ కృషి చేయాలని కోరారు. డ్రగ్ డి అడిక్షన్ సెంటర్ డైరెక్టర్ మంజుల మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది, రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ టి. చైతన్య రీసర్చ్ అసిస్టెంట్ ప్రీతి, విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేంద్ర బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌వియులో

తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో ని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి. ఎల్. చెన్నా రెడ్డి, చంద్రికా భాయి, కళాశాల ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు , అధ్యాపకులు క్రిష్ణకిషోర్ , లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

తిరుపతి సిటీ: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్‌ఈబీ) బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ టౌన్ క్లబ్, బాలాజీ కాలనీ, జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ మత్తు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపు నిచ్చారు. ప్రజల సహకారంతో డ్రగ్స్ మూలాలను కనుగొని వాటిని పూర్తిగా సర్వనాశనం చేయాలనే ముఖ్య ఉద్దేశంతోనే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యాన్‌చంద్ర మాట్లాడుతూ యువత మత్తుకు బానిసై నిర్వీర్యం అయితే, మన దేశం ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని, ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ యువతను ఉద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, విమల కుమారి, ఏ.రాజేంద్ర, ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకిరామ్, డీఎస్పీలు రవి మనోహర్ ఆచారి, రమణ కుమార్, సిఐలు, ఎస్ఐలు, సబ్ సిబ్బంది, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పుత్తూరు టౌన్ : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని పుత్తూరు సిఐ ఓబులేష్ పేర్కొన్నారు. మాదక ద్రవ్య నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్ ఆర్ ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోలీసు సిబ్బందులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఓబులేష్, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో సీఐ వై ఉరుకుందమ్మ, ఏఎస్ఐ కె భాస్కర్, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: నేటి సమాజంలో మాదక ద్రవ్యాల నిర్మూలనే ప్రభుత్వం లక్ష్యమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ అన్నారు. పిల్లలలో అనుకోని అనుమానస్పద మార్పులు ఉంటే దయచేసి పోలీసులకు తెలపాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్య వ్యతిరేక నవ సమాజ నిర్మాణం చేపడుదామని, గ్రామీణ యువత మాదక ద్రవ్యాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఇందుకోసం యువతకు అవగాహన కల్పించాలని కుప్పం ముఖ్యమంత్రి పర్యటనలో వున్న ఎమ్మెల్యే పులివర్తి నాని సెల్ ఫోన్ ద్వారా అధికారులను కోరారు. చంద్రగిరిని మత్తు పదార్థాల రహిత నియోజకవర్గం తీర్చిదిద్దటానికి అందరూ కృషి చేయాలన్నారు. ఇందుకోసం పాఠ శా లలు, కళాశాలలు, గ్రామాలలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

శ్రీకాళహస్తి: మాదక ద్రవ్యాల వినియోగంతో యువత భవిత బుగ్గిపాలు అవుతుందని టూ టౌన్ సీఐ రారాజు అన్నారు. తొట్టంబేడు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'ప్రపంచ మాదకద్రవ్యాల దుర్వినియోగం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినం' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, సంస్థ మేనేజర్ రమేష్ సిబ్బంది భాస్కర్, గాయత్రి, రోజా, సురేష్, కళావతి, దేవేంద్ర, సునీత, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE:: SRIKALAHASTI
H.M.O.P. No.45/2023

Between:
Pathi Kamakshi ...**Petitioner**
And:
Pathi Balaji, Pathi Deena Balaji ...**Respondents**
To
Pathi Balaji @ Pathi Deena Balaji, S/o. P.Subramanyam, Chenchu Lakshmi Colony, Srikalahasti Town, Tirupati Dist.

Notice

పై నెంబరు పిటిషన్‌లో Divorce కొరకు వేసిన పిటిషన్‌లో రెస్పాండెంట్‌కి నోటీసులు పంపించిన చేరనందున రెస్పాండెంట్‌కి పేపర్ ప్రకటన ద్వారా వాయిదా 27.06.2024వ తేదీన యున్నది. కావున రెస్పాండెంట్ పై తెలిపిన తేది ఉదయం 10:30 ని॥లకు పై కోర్టులో వ్యక్తి గతంగా గానీ లేదా లాయరు ద్వారా గానీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపవలయును. లేనిచో పై కోర్టువారు రెస్పాండెంట్‌ను పరోక్షముగా నిర్ణయం తీసుకొనబడును.
వాయిదా 27.06.2024

ఇ.సత్యనారాయణ B.Sc., B.L.,
అడ్వకేట్ శ్రీకాళహస్తి

బహిరంగ ప్రకటన

నా కక్షిదారుడైన రేణిగుంట మండలం, వెదళ్ళచెరువు పోస్ట్, గుత్తివారిపల్లి గ్రామం వాస్తవ్యుడైన శ్రీ జి.నాగరాజు గారి కుమారుడు శ్రీ జి.చెంగారెడ్డి గారి సూచనల మేరకు ఇచ్చు బహిరంగ ప్రకటన ఏమనగా.. నా కక్షిదారుడు దిగువ కనబరచిన స్థిరాస్తిపై సదరు స్థిరాస్తికి దఖలు పడి **రిజిష్టర్డ్ విక్రయపత్రం నెం. 4585/ 2017 తేది: 16.10.2017** సెక్యూరిటీగా వుంచి రుణమునకు సంప్రదించియున్నారు. సదరు పత్రము ఎవరికైనా అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోపు ఈ దిగువ తెలిపిన చిరునామాకు తెలియజేయగలరు. అనంతరం వచ్చు అభ్యంతరములు, ఆక్షేపణల పరిశీలించ బడవు.

SCHEDULE: Tirupati District - Renigunta Sub-District - ReniguntaMandal - R.Malla varam Village accounts - Guthivaripalli - R.C.C .House vide H.D.No.1-123 - Grama Kantam Sy.No.225 - bounded on: East : Site of P.Giri,West : Site of M.Muni reddy, North : Road (Rajaveedhi), South : Site of G.Munemma In between this measuring East to West 18 fts.or 5.49mts. North to South 48 fts.or 14.640 mts. Ad measuring 864 Sq.fts. or 96 Sq.yards of site

ఎం.హరీష్, అడ్వకేట్, నెం.100,
1వ అంతస్తు, ప్రకాశం రోడ్డు,తిరుపతి, సెల్: 9949995779